క్లుప్తంగా

బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యరెడ్డికి సన్మానం



భాగ్యరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ : బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన బొబ్బా భాగ్యరెడ్డిని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు ఘనంగా సన్మానించారు. శుక్రవారం నల్లగొండలో జరిగిన నల్లగొండ-వరంగల్- ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయనను ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు శాలువా పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాల్గొనాలి

నడిగూడెం : పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాల్గొనాలని నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బెల్లంకొండ నవీన్‌గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2020 నవంబర్ 1కంటే ముందు పట్టభద్రులే ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

గోమాతకు ప్రత్యేక పూజలు



గోమాతకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీఆదివరహా లక్ష్మీనర్సింహా వేణుగోపాలస్వామి దేవాలయంలో శుక్రవారం గోమాతకు భక్తులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, సహస్ర కుంకుమార్చన, ఆరాధన, స్వామివార్లకు పంచామృతాలతో అభిషేకం, మంగళశాసనం, తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ ఎంపీ లక్ష్మణరావు, అర్చకులు ముడుంబై హరీష్‌కుమార్‌చార్యులు, సిబ్బంది గోవిందరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

మద్యం, మాంసం బంద్‌కు సహకరించాలి

నేరేడుచర్ల : అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ట రోజున మద్యం, మాంసం బంద్‌కు సహకరించాలని అయోధ్య తీర్థ క్షేత్ర ట్రస్టు సభ్యులు మెట్టు వేణుగోపాల్‌రెడ్డి, పాల్వాయి రమేష్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కోట్లాది మంది దేశప్రజలు 500 ఏళ్లుగా ఎదురుచూస్తున్న అయోధ్య రామాలయ నిర్మాణం పూర్తి కావడం, ఈనెల 22న ప్రారంభోత్సవం, రాముడి విగ్రహ ప్రతిష్ట జరుగుతుండడం శుభ పరిణామమన్నారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలు మద్యం, మాంసానికి దూరంగా ఉండాలని కోరారు. సమావేశంలో కొణతం సత్యనారాయణరెడ్డి, రాచకొండ రామకృష్ణారావు, తాళ్లూరి రమేష్, పురిమల్ల రామ్మూర్తి, నటరాజ్, కొణతం నాగిరెడ్డి, కోటేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, మోహన్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదెలు మృతి



మృతి చెందిన పాడిగేదెలు

మఠంపల్లి : విద్యుదాఘాతంతో రెండు పాడిగేదెలు మృతి చెందాయి. ఈ సంఘటన శుక్రవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కీసర పెదనాగయ్య రెండు పాడిగేదెలను మేతకోసం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోకి తీసుకెళ్లాడు. అక్కడ మేతమేస్తున్న క్రమంలో తెగిపడిన విద్యుత్ తీగలకు ప్రమాదవశాత్తు గేదెలు తగిలి అక్కడిక్కడే మృతి చెందాయి. దీంతో రూ.1లక్ష 20వేల నష్టం వాటిలినట్లు ప్రభుత్వం, ట్రాన్స్‌కో అధికారులు తనను ఆదుకోవాలని బాధిత రైతు వాపోయాడు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

కోదాడరూరల్ : మండలంలోని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని ఎంపీపీ మల్లెల రాణిబ్రహ్మయ్య, జెడ్పీటీసీ మందలపు కృష్ణకుమారిశేషు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఎర్రవరం స్టేజీ, పీఏసీఎస్ గోదాముల వద్ద మంచినీటి బోరు పనులను వారు ప్రారంభించి మాట్లాడారు. రానున్న వేసవిలో గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ వీరేపల్లి సుబ్బారావు, పీఏసీఎస్ చైర్మన్ నలజాల శ్రీనివాసరావు, లతీఫ్, క్షత్రయ్య తదితరులు ఉన్నారు.

ప్రమాదపు అంచున ప్రయాణం

- ఆటోలు, ట్రాక్టర్లలో పరిమితికి మించి కూలీలను తరలిస్తున్న రైతులు
- ప్రమాదాలు జరగకముందే చర్యలు తీసుకోవాలని కోరుతున్న ప్రజలు



ట్రాక్టర్, ఆటోలో పరిమితికి మించి వెళ్తున్న కూలీలు



మేళ్లచెరువు : వ్యవసాయ కూలీలు కూలి కోసం నిత్యం ప్రమాదకర ప్రయాణం సాగిస్తున్నారు. తమ స్వగ్రామాల నుంచి పలు మైళ్ల దూరం ట్రాక్టర్‌ల్ల, ఆటోల్లో పరిమితికి మించి వెళ్తున్నారు. ఉమ్మడి మేళ్లచెరువు మండలంలో సుమారు 3 వేల హెక్టారుల్లో పత్తి, 9 వేల ఎకరాల్లో సాగు చేసిన మిరప పంట తీసేందుకు కూలీలు సుమారు 30 నుంచి 50 కిలోమీటర్లు వెళ్తున్నారు. మేళ్లచెరువు, చింతలపాలెం మండలాల్లోని తమ్మవరం, గుడిమల్కాపురం, వేపలమాధవరం, కిష్టాపురం, రేవూరు గ్రామాల్లో వేసిన మిరపకాయలు కోసేందుకు ట్రాక్టర్లు, ఆటోల్లో కిక్కిరిసి ప్రయాణం సాగిస్తున్నారు.

అడ్డదారుల్లో తీసుకెళ్తూ..

ట్రాలీ ఆటోల్లో సామర్థ్యానికి మించి 30 మందికి పైగా వెళ్తున్నారు. మెయిన్ రోడ్డుతో పాటు అడ్డదారుల్లో సైతం కిక్కిరిసి వెళ్తుండడంతో ఎదురుగా వచ్చే వాహనాలతో ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. అదేవిధంగా పొలం గట్ల వద్ద ఉన్న గుంతల్లో వాహనాలు అదుపుతప్పి పడిపోయే ప్రమాదం ఉంది. అయితే పొలం యజమానులు కూలీలకు ఎక్కువ వాహనాలు పెట్టలేక ఒకే వాహనంలో ఎక్కువ మందిని ఎక్కించి తీసుకెళ్తున్నారు. పోలీసులు స్పందించి పరిమితికి మించి కూలీలను తరలిస్తున్న వాహనాలను గుర్తించి తగిన చర్యలు తీసుకుని ప్రమాదాలను నివారించాలని పలువురు మండలవాసులు కోరుతున్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి

వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి. నిరుపేద కుటుంబాలకు చెందిన కూలీలు నిత్యం పనులకు వెళ్లి వస్తుంటారు. ప్రమాదాలు జరిగితే వారి కుటుంబసభ్యులు వీధిన పడాల్సి వస్తుంది. వాహనాల్లో కూలీలను అధికంగా తీసుకెళ్లే వాహనాల యజమానులపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

– వట్టెపు సైదులు, సీపీఎం మండల కార్యదర్శి

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



కోదాడ : క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, ఉపాధ్యాయులు

- ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి

కోదాడ : తెలంగాణ రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అమరబోయిన వెంకటరత్నం మాట్లాడారు. గత ప్రభుత్వం మధ్యలో నిలిపిన ఉపాధ్యాయ బదిలీలు, ప్రమోషన్లను వెంటనే చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాతంగి ప్రభాకర్‌రావు, బొడ్డు హుస్సేన్, సూరేపల్లి దేవుడు, సంజీవ్ పవన్‌కుమార్, వెంకటయ్య, పిడమర్తి వెంకటేశ్వర్లు, నందపాటి సుధాకర్, పిడమర్తి అంకులయ్య, రమేష్, సుందర్‌రావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే ముస్లింల అభివృద్ధి



కోదాడరూరల్ : ఉర్సులో పాల్గొన్న ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, ముస్లింలు

కోదాడరూరల్ : కాంగ్రెస్ పార్టీ హయాంలోనే ముస్లింల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి అన్నారు. మండలంలోని గుడిబండలో గల హజ్రత్ ఖాజా గరీబ్‌నవాబ్ ఉర్సు వేడుకల్లో గురువారం రాత్రి ఆమె పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆమెకు ఉర్సు నిర్వాహకులు, మతపెద్దలు, కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమె మాట్లాడారు. ఉర్సు అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ లంకెల అలివేలుమంగమ్మ, ఉర్సు అధ్యక్షులు డాక్టర్ మహ్మద్‌అసిఫ్‌అలీ, ఇంతియాజ్‌అలీ, ఫయాజ్‌అలీ తదితరులు ఉన్నారు.

మంత్రి ఉత్తమ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు



మంత్రి ఉత్తమ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నవీన్‌నాయక్

మఠంపల్లి : మండలంలోని బీల్యానాయక్ తండాకు చెందిన కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు ధరావత్ నవీన్‌నాయక్, మండలంలోని పెదవీడుకు చెందిన బ్లాక్ కాంగ్రెస్ మాజీ ఉపాధ్యక్షుడు సాముల వెంకటేశ్వర్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి మంత్రి ఉత్తమ్ కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. వారి వెంట పలువురు కాంగ్రెస్ మండల నాయకులు ఉన్నారు.

దొడ్డా నర్సయ్యకు నివాళి



నర్సయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

చిలుకూరు : మండల కేంద్రంలోని బాపూజీ శాఖా గ్రంథాలయంలో హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే దొడ్డా నర్సయ్య వర్ధంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడారు. చిలుకూరు గ్రంథాలయం ఏర్పాటుకు దొడ్డా నర్సయ్య చేసిన సేవలు మరువలేనివన్నారు. అలాంటి మహానీయులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు దొడ్డా నారాయణరావు, బొలిశెట్టి నాగేంద్రబాబు, దొడ్డా సురేష్‌బాబు, గ్రంథాలయం అధ్యక్ష, కార్యదర్శులు అంబాల వెంకటి, పిల్లుట్ల కృష్ణయ్య, నాయకులు బండ్ల కోటయ్య, కస్తూరి నర్సయ్య, కొండా కోటయ్య, అలసకాని వెంకటయ్య, సాయికృష్ణ, చిలువేరు చలమయ్య, సైదయ్య, గ్రామపెద్దలు, అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



హుజూర్‌నగర్ : మాట్లాడుతున్న డీఎస్పీ ప్రకాష్

హుజూర్‌నగర్ : సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కోదాడ డీఎస్పీ ప్రకాష్, సూర్యాపేట సైబర్ క్రైమ్ డీఎస్పీ శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని ప్రియదర్శిని డిగ్రీ కళాశాలలో శుక్రవారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. సైబర్ నేరాలు, డ్రగ్స్ మత్తు మందులు, గంజాయి నిషేధం గురించి వివరించారు. సోషల్ మీడియా, ఓటీపీ ఫ్రాడ్స్, సైబర్ నేరాలు, టోల్ ఫ్రీ నంబర్ 1930గురించి తెలిపారు. సెల్‌ఫోన్ వల్ల కలిగే అనర్థాలు, షీటీమ్స్, మహిళల భద్రత, పిల్లలపై సోషల్ మీడియా ప్రభావం, విద్యార్థులు చెడు వ్యసనాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ రామలింగారెడ్డి, ఎస్‌ఐలు ముత్తయ్య, మల్లేష్, ఏఎస్‌ఐలు బలరాం రెడ్డి, రమేష్, ప్రియదర్శిని విద్యాసంస్థల కరస్పాండెంట్ పశ్య శ్రీనివాస్‌రెడ్డి, సైబర్ క్రైమ్స్ వారియర్స్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



కోదాడరూరల్ : విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్‌ఐ వెంకటేశ్వరరావు

కోదాడరూరల్ : సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని రూరల్ పోలీస్‌స్టేషన్ ఏఎస్‌ఐ వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నెమలిపురిలో గల బాలుర గురుకుల పాఠశాలలో సైబర్‌నేరాలపై పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. సోషల్ మీడియా, డ్రగ్స్, గంజాయి వంటివి తీసుకుంటే ఎదురయ్యే అనర్థాలను, వాటిబారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వెంకటేశం, పోలీసు సిబ్బంది సమ్మద్, సురేష్, నరేష్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులు ఓటు నమోదు చేసుకోవాలి

మునగాల : అర్హులైన ప్రతిఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని తహసీల్దార్ పి.ఆంజనేయులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈనెల 20, 21తేదీల్లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ-2024పై ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 01.01.2024నాటికి 18సంవత్సరాలు నిండిన యువతి, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. అదే విధంగా ఓటరు జాబితాలో పేరు, చిరునామా, తదితర సవరణల అవకాశం కల్పించినట్లు తెలిపారు. శాసనసభ నియోజకవర్గంలోని ఒక పోలింగ్ కేంద్రం నుంచి మరోక కేంద్రానికి మార్పుకు కూడా అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. వరంగల్-ఖమ్మం- నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో తహసీల్దార్ కార్యాలయంలో ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు.

20, 21వతేదీల్లో ఓటరు నమోదు

హుజూర్‌నగర్ : సాధారణ ఓటరు నమోదు ప్రత్యేక ప్రచార కార్యక్రమంలో భాగంగా 20, 21వతేదీల్లో ఓటర్ల నమోదు నిర్వహించనున్నట్లు ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బూత్ స్థాయి అధికారులు వారివారి పోలింగ్ కేంద్రాల్లో ఉండి ఓటరు నమోదు, మార్పులు, చేర్పుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. బీఎల్‌ఓలపై పర్యవేక్షణకు నియమించిన సూపర్‌వైజర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి బీఎల్‌ఓలకు వచ్చిన దరఖాస్తుల వివరాలు సేకరిస్తారని ఆయన వెల్లడించారు. జనవరి 1వతేదీ నాటికి 18ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేయడంలో బీఎల్‌ఓలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారని తెలిపారు. అదే విధంగా చనిపోయిన, డబుల్ ఓటర్ల వివరాలు నమోదు చేసి ఆ తర్వాత వాటిని పరిశీలించి తొలగించనున్నట్లు పేర్కొన్నారు.

బహుమతులు పంపిణీ



నగదు బహుమతి అందజేస్తున్న నాయకులు

మఠంపల్లి : మండలంలోని యాతవాకిళ్లలో బీఆర్‌ఎస్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా చివరి రోజు విజేతలకు స్థానిక సర్పంచ్ కోలాహలం లక్ష్మీనరసింహారాజు బహుమతులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. మొదటి బహుమతి రూ.20వేలు, షీల్డు మీగడంపాడుతండా జట్టు కైవసం చేసుకున్నట్లు, రెండో బహుమతి యాతవాకిళ్ల యూత్ టీమ్ రూ.15వేలు, షీల్డు, మూడో బహుమతి కల్మల్‌చెరువు రూ.10వేలు, షీల్డు, నాలుగో బహుమతి రూ.5వేలు, షీల్డును అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోలాహలం కృష్ణంరాజు, మస్తాన్, నాగయ్య, నాగులు, లింగరాజు, లక్ష్మణ్‌రాజు, దాతలు సైదయ్య, ఉద్దండు, నరసింహారావు, లచ్చయ్య, తదితరులున్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

పాలకవీడు : మండలంలోని మహంకాళిగూడెం పరిధిలో గల డెక్కన్ సిమెంట్ పరిశ్రమలో శనివారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు పరిశ్రమ సీజీఎం నాగమల్లేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నల్లగొండ జిల్లా మిర్యాలగూడెంకు చెందిన మ్యాక్స్‌కేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో కంటి సమస్యలు, ఎముకల వ్యాధులకు ఉచిత వైద్యం అందించి మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు. ఈ శిబిరానికి జాన్‌పహాడ్, రావిపహాడ్, మహంకాళిగూడెం, కల్మేట్‌తండా గ్రామాల ప్రజలకు ఉచిత రవాణా సౌకర్యం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



పట్టుబడిన పీడీఎస్ బియ్యం

గరిడేపల్లి : అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కేసు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. మండలంలోని గడ్డిపల్లి నుంచి పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నారనే సమాచారంతో పొనుగోడు క్రాస్‌రోడ్డులో వాహన తనిఖీ చేపట్టామని, ఆ సమయంలో ఓ డీసీఎం వాహనం అనుమానాస్పదంగా రాగా వాహనాన్ని నిలిపి తనిఖీ చేయగా 24క్వింటాల పీడీఎస్ బియ్యం దొరకడంతో డ్రైవర్ సంజీవపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ తనిఖీల్లో సిబ్బంది నగేష్, యువరాజు పాల్గొన్నారు.

వ్యవసాయానికి 18గంటల విద్యుత్ కొనసాగించాలి



కల్మేట్‌తండాలో విచారణ చేపడుతున్న డీఈ వెంకటకృష్ణ

పాలకవీడు : వ్యవసాయానికి ప్రస్తుతం అందిస్తున్న 18గంటల విద్యుత్‌ను కొనసాగించాలని మండలంలోని జాన్‌పహాడ్, చెరువుతండా గ్రామాల రైతులు డీఈ వెంకటకృష్ణకు తెలిపారు. ఇటీవల మండలంలోని జాన్‌పహాడ్ గ్రామానికి చెందిన పలువురు వ్యవసాయానికి 18గంటల విద్యుత్ కొనసాగుతుండడంతో గ్రామాల్లో మంచినీటి బోర్లలో భూగర్భజలాలు అడుగంటుతున్నాయని, వ్యవసాయానికి ఇస్తున్న త్రీఫేజ్ విద్యుత్‌ను 12గంటలకు కుదించాలని కోరుతూ నలగొండ జిల్లా కేంద్రంలో సీఎండీ ఆధ్వర్యంలో జరిగిన ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు డీఈ వెంకటకృష్ణ శుక్రవారం ఆ ఫీడర్ పరిధి గ్రామాల్లో విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా చెరువుతండా, జాన్‌పహాడ్, కల్మేట్‌తండా గ్రామస్తులు వ్యవసాయానికి ప్రస్తుతం ఇస్తున్న 18గంటల విద్యుత్‌నే కొనసాగించాలని కోరారు. మరికొందరు త్రీఫేజ్ విద్యుత్ సమయాన్ని కుదించాలని లేదంటే గ్రామాల్లో నీటి అవసరాలకు ఇక్కట్లు ఏర్పడతాయని విన్నవించారు. ఈ మేరకు పరిస్థితిని ఉన్నతాధికారులకు నివేదించి తగిన చర్యలు చేడతామని డీఈ రైతులకు తెలిపారు. ఆయన వెంట సబ్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు, లైన్‌మెన్ సైదారావు, ప్రజలు ఉన్నారు.

ఆరు గ్యారంటీలను అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న హుస్సేన్

హుజూర్‌నగర్ రూరల్ : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను వెంటనే అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి పోషణబోయిన హుస్సేన్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని శ్రీనివాసపురంలో పార్టీ గ్రామ కార్యదర్శి వెంగల్‌రెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ శాఖ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వం అవలంబించిన ప్రజావ్యతిరేక విధానాలకు సీపీఎం పెద్దఎత్తున పోరాటం చేసిందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణిలో ఉన్న మోసాలను వెంటనే ఎండగట్టాలని ప్రభుత్వాని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలతో పాటు రేషన్‌కార్డులు, పెన్షన్లు, ఇళ్ల స్థలాలు, స్థానిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యురాలు తంగెళ్ల వెంకటచంద్ర, మాడూరి నర్సింహాచారి, లక్ష్మీనర్సమ్మ, శేషగిరిరావు, గోపరాజు, మట్టారెడ్డి, పూర్ణాహుతి, శ్రీను, స్వామి, బిందు తదితరులు పాల్గొన్నారు.

చెరువులు, కుంటలకు హద్దురాళ్లు ఏర్పాటు చేయించాలి



హుజూర్‌నగర్ : మంత్రి ఉత్తమ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ రెవెన్యూ పరిధిలో గల చెరువులు, కుంటల్లో పూడిక తొలగించి హద్దురాళ్లు ఏర్పాటు చేయించాలని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పట్టణ కమిటీ సభ్యులు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన క్యాంప్ కార్యాలయంలో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం కమిటీ సభ్యులు మాట్లాడారు. హుజూర్‌నగర్ రెవెన్యూ పరిధిలో ఊరచెరువు, అల్లక సింగారికుంట, బట్టవారికుంట, పోతిరేణికుంట, పోతులూరి కుంటలు ఉన్నాయని వాటిలో పూడిక తీయించి హద్దురాళ్లు ఏర్పాటు చేసి నీటితో నింపాలని కోరారు. పట్టణ పరిధిలోని ఊరచెరువును ట్యాంక్‌బండ్‌గా పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలన్నారు. అంతే కాకుండా ప్రభుత్వం చేపపిల్లల సరఫరాను మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల ద్వారా చేపట్టాలని వారు కోరారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు శీలం శ్రీను, ప్రధాన కార్యదర్శి చింతలకాయల రాము, సభ్యులు శీలం వెంకన్న, మల్లయ్య, సీతారాములు, నర్సయ్య, గోపమ్మ తదితరులు పాల్గొన్నారు.

నీటిని విడుదల చేయాలని వినతి

గరిడేపల్లి : సాగర్ ఎడమకాల్వకు నీటిని విడుదల చేయాలని కోరుతూ మండలానికి చెందిన పలువురు నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కటికం రమేష్ మాట్లాడుతూ.. యాసంగిలో సాగర్ ఎడమకాల్వ కింద బోర్లు, బావులు, చెరువుల్లో నీరు లేక వరిపంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని నీటిని విడుదల చేయించి సాగర్ ఎడమకాల్వ కింద పంటలను కాపాడాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో ఎంపీటీసీ మేళ్లచెరువు వెంకటరమణ, వనపర్తి గుర్వయ్య, బత్తిని రాంబాబుగౌడ్ తదితరులు ఉన్నారు.

పీఆర్టీయూ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న ఎంపీపీ సుజాత, ఉపాధ్యాయులు

గరిడేపల్లి : మండలంలోని పొనుగోడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పీఆర్టీయూ టీఎస్ నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను ఎంపీపీ పెండెం సుజాత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయుల సమస్యలపై దృష్టి పెట్టి, బదిలీలు, ప్రమోషన్స్ చేపట్టాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని, పెండింగ్ నిధులను విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు మైనం ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి ఎర్ర కృష్ణారెడ్డి, సువర్ణ, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గోదేశి దయాకర్, సుందరి శ్రీనివాస్, బొంత సైదిరెడ్డి, జానయ్య, సైదులు, మేకల సందీప్, సైదా, వెంకటేశ్వర్లు, తొగరు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, కృష్ణయ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు కలిసికట్టుగా పనిచేయాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : ఎస్సీ వర్గీకరణకు కలిసికట్టుగా పనిచేయాలని, ఎమ్మార్పీఎస్ ఉద్యమం తుదిదశకు చేరుకుందని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ టి.అంజయ్య అన్నారు. శుక్రవారం చింతలపాలెంలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వర్గీకరణ కోసం 30ఏళ్లగా చేసిన పోరాటం నేడు అంతిమదశకు చేరుకుందన్నారు. మరి కొన్నిరోజుల్లో సుప్రీంకోర్టు ద్వారా ఎస్సీ వర్గీకరణ జరగబోతుందని అన్నారు. ఉద్యమ లక్ష్యం నెరవేరే సందర్భంలో మాదిగలంతా అండగా నిలవాలని ఆయన కోరారు. అనంతరం సంఘాల మండల నూతన కమిటీలను ఎన్నుకున్నారు. సమావేశంలో నాయకులు కె.ఆంజనేయులు, బాలచంద్రుడు, ప్రసాద్, రామయ్య, ప్రభాకర్, ప్రేమ్‌కుమార్, ఆరోన్, నాగేశ్వరరావు, దావీదు, గోపి, వీరబాబు, రాజు తదితరులు ఉన్నారు.

మిషన్ భగీరథ నీటిని అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : మండలంలోని పలు గ్రామాలకు మిషన్ భగీరథ నీరు అందడం లేదని, వెంటనే అందించాలని పలువురు ప్రజాప్రతినిధులు అన్నారు. చింతలపాలెం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు సమావేశంలో గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యలపై మాట్లాడారు. పలు గ్రామాలకు ఆర్టీసీ బస్సులు రావడం లేదని, ఉపాధిహామీ కూలీలు చేసిన పనులకు బిల్లులు చెల్లించలేదని వారు తెలిపారు. అధికారులు స్పందించి ఈ సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ కె.వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ పి.శ్రీనివాసరావు, ఎంపీడీఓ జగదీష్, తహసీల్దార్ సురేందర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

గరిడేపల్లి : మండల పరిధిలోని పొనుగోడు గ్రామానికి చెందిన అప్పికట్ల కాంతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. శుక్రవారం మృతురాలి కుటుంబానికి జోగు పిచ్చిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. అదే విధంగా జోగు అరవింద్‌రెడ్డి యువసేన ఆధ్వర్యంలో 15కేజీల బియ్యం, 15కేజీల నూనె, సరుకులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జోగు సరోజనమ్మపిచ్చిరెడ్డి, ఫౌండేషన్ కోశాధికారి జోగు అరవింద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మునగాల : మండలంలోని ముకుందాపురం గ్రామానికి చెందిన దేవరం నర్సిరెడ్డి గతంలో భవనంపై జారిపడి మంచానికే పరిమితమై చికిత్స పొందుతున్నాడు. దీంతో పందిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆ ఫౌండేషన్ చైర్మన్ పందిరి నాగిరెడ్డి బాధితుడికి శుక్రవారం రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ గౌరవ సలహాదారుడు సేకు శ్రీనివాసరావు, కార్యదర్శి ఇమ్మడి సతీష్‌బాబు, గ్రామసర్పంచ్ పందిరి కళావతి, వార్డుసభ్యులు, గ్రామపెద్దలు నూకల రామకృష్ణ, ఉప్పలవంచు శ్రీనివాసరావు, నాయకులు తదితరులు ఉన్నారు.